క్లుప్తంగా

రేషన్ సకాలంలో పంపిణీ చేయాలి



రేషన్ సరుకుల డీలర్లతో మాట్లాడుతున్న సీఎస్‌డీటీ రమేష్‌బాబు

సీతానగరం: రేషన్ సరుకులను వినియోగదారులకు సకాలంలో పంపిణీ చేయాలని సీఎస్‌డీటీ రమేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్నందున డీలర్లు ఎన్నికల నిబంధనలకు లోబడి సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. బియ్యం, పప్పులు, చోడిపిండి, పంచదారలకు సంబంధించి నిర్దేశిత గడువులోగా చలానాలు తీసి సరుకులు విడిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్‌ఐ రామారావు, రేషన్ డిపో డీలర్లు, నిత్యావసర సరుకుల పంపిణీ వాహనదారులు పాల్గొన్నారు.

సంచార పశువైద్య కేంద్రం డాక్టర్‌గా కావ్యశ్రీ



సీతానగరం: మండలంలోని 1962 సంచార పశువైద్య కేంద్రం డాక్టర్‌గా ఎం.కావ్యశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పశువైద్య సహాయ సంచాలకుడు సీహెచ్ దీనకుమార్ సూచన లమేరకు పాడి పశువులకు మెరుగైన సేవలందిస్తానని చెప్పారు. పశువులకు ఆరోగ్యపరమైన ఇబ్బందులుంటే 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే 30 నిమిషాల్లో చేరుకుని వైద్య సేవలందిస్తామన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి..



మాట్లాడుతున్న తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు

సీతానగరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎంల వినియోగంపై ఇస్తున్న శిక్షణను వినియోగించుకోవాలని తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు కోరారు. జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాస్టర్ ట్రైనీలు ఈవీఎంల వినియోగం, ఓటింగ్ చేయడంపై శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు జి.సూరిదేముడు, ఎం. వెంకటరమణ, మాస్టర్ ట్రైనీలు పి.రామకృష్ణ, బి.సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



విగ్రహం ఏర్పాటుకు పీఠం నిర్మిస్తున్న దృశ్యం

సాలూరు: పట్టణంలోని బొడ్డవలసలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన చేశారు. రిటైర్డ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చింతగడ దాస్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబేడ్కర్ గొప్పతనాన్ని గ్రామస్తులకు తెలియజేశారు.

చెక్‌గేట్ తొలగించలేదు: ఎస్సై

భామిని: మండల కేంద్రం నుంచి గిరిజన ప్రాంతాలకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన చెక్‌గేట్ తీసేయలేదని బత్తిలి ఎస్సై చిట్టిపోలు ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. భామిని వద్ద ఏర్పాటు చేసినది డైనమిక్ చెక్ గేట్ అని, ఎక్కడ చెక్ గేట్ అవసరం ఉంటే అక్కడు దాన్ని తరలిస్తున్నామని తెలిపారు. బత్తిలి సరిహద్దు చెక్‌గేట్ నిరంతరం పనిచేస్తుంటుందని, తనిఖీలు కొనసాగుతుంటాయని వివరించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరమని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరావు అన్నారు. మండలంలోని వెలగవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించినపుడు ఏ విధంగా స్పందించాలి, మంటలను ఎలా అదుపుచేయాలి, ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తదితర అంశాలను వివరించారు. డెమో ప్రదర్శనతో మంటలు అదుపుచేసే విధానాన్ని వివరించారు.

మెరుగైన సేవలు అందించాలి

పాలకొండ రూరల్: పీహెచ్‌సీల ద్వారా గ్రామీణ ప్రజలకు 24 గంటల సేవలు మరింత మెరుగ్గా కొనసాగించాలని డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు అన్నారు. మండలంలోని అన్నవరం పీహెచ్‌సీని బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రికార్డులను పరిశీలించారు. ఇన్-పేషెంట్ల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. ఆస్పత్రి ప్రసవాలను మరింత ప్రోత్సహించాలని నైట్‌డ్యూటీలో ఉన్న హెడ్‌నర్సు రవణమ్మకు సూచించారు.

జగనన్నకే ప్రజల మద్దతు..

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం పట్టణంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: జగనన్నకే మళ్లీ ప్రజలు మద్దతిస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్వతీపురం పురపాలక సంఘం బెలగాం ప్రాంత పరిధిలో గల 14, 15, 17వ వార్డుల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ పాలనలో మీకు మేలు జరిగితేనే ఓటు వేయాలని కోరారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు రైతు రుణమాఫీ చేస్తానని ప్రకటించి, ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదన్నారు. అదే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీతో పాటు డ్వాక్రా సభ్యుల రుణాలను కూడా మాఫీ చేశారని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని చంద్రబాబు పాతాళానికి తొక్కేస్తే.. జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండగలా మార్చారని కొనియాడారు. గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతకు అవసరమైన అన్ని సేవలూ ఊరిలోనే అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. విత్తనం నుంచి విక్రయం వరకు అన్నీ ఆర్‌బీకేల ద్వారా జరుగుతున్నాయన్నారు. అకాల వర్షాలకు తడిచిన ధాన్యం సైతం కొనుగోలు చేసి రైతుకు అండగా నిలిచింది ఒక్క జగనన్న మాత్రమేనని తెలిపారు. వ్యవసాయానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. నవరత్నాల పథకాలను అమలు చేసి, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండేలా పాలన చేపట్టిన సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. పార్వతీపురం నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలన్నారు. ప్రజలు మాయమాటలు నమ్మకుండా, ఎన్నికల హామీలను అమలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమాలలో పురపాలక సంఘ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జమదాల గ్రామంలో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు

ప్రజాభిమానంతో గెలుస్తాం..

పార్వతీపురం టౌన్: పొత్తులతో కాదు... ప్రజాభిమానంతో గెలుస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండోసారి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచిన తనను గెలిపించాలని కోరుతూ మండలంలోని జమదాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న మండల విద్యాశాఖ అధికారి సామల సింహాచలం

పార్వతీపురం టౌన్: ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పార్వతీపురం మండల విద్యాశాఖ అధికారి సామల సింహాచలం అన్నారు. మండలంలోని నర్సిపురం రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల వద్ద ప్రత్యేక అవసరాలు పిల్లల కోసం సమగ్ర శిక్ష జిల్లా కో ఆర్డినేటర్ భానుమూర్తి పర్యవేక్షణలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సింహాచలం మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రతి మండలంలో భవిత కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీరికి ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు బోధిస్తారన్నారు. ఈ రోజు నిర్వహిస్తున్న ఉచిత వ్యాధి నిర్ధారణ శిబిరంలో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట, కొమరాడ, గరుగుబిల్లి, తదితర ఐదు మండలాలకు చెందిన వైద్యులు పాల్గొని సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు అమ్మన్నరావు, పార్వతీపురం, సీతానగరం ఎంఈఓలు కె. ప్రసాదరావు, ఎం.వెంకటరమణ, ఎముకల వైద్య నిపుణుడు శేషగిరిరావు, ఫిజియోథెరపిస్టులు అజయ్, అఖిల్, ఐఈఆర్పీలు తిరుమలదేవి, అనిత, రమణమ్మ, సీఆర్ఎంటీ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మతల్లి అనుపోత్సవం



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

మక్కువ: మండలంలో కొండబుచ్చమ్మపేట, సరాయివలస గ్రామాల గ్రామదేవత బంగారమ్మతల్లి అనుపోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రధాన పండగ జరగ్గా, బుధవారం అనుపోత్సవం వేడుకగా నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. అనంతరం అనుపోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఘటాలను బంగారమ్మతల్లి గద్దె వద్దకు పూజారి కుటుంబీకులు తీసుకువెళ్లారు. ఏడేళ్ల తరువాత గ్రామదేవత పండగలు నిర్వహించడంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

విస్తృతంగా వాహన తనిఖీలు



మక్కువ మూడురోడ్ల కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మక్కువ: మండల కేంద్రమైన మక్కువ మూడు రోడ్ల జంక్షన్ వద్ద బుధవారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఎన్నికల దృష్ట్యా మక్కువ, దుగ్గేరు, శంబర, కోన రహదారులు కూడలి వద్ద చెక్‌పోస్టును అధికారులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రం నుంచి, ఇతరాత్ర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను నిశితంగా తనిఖీ చేశారు. వాహనదారుల వివరాలను రికార్డుల్లో నమోదుచేశారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు తరలింపుపై పటిష్ట నిఘా పెట్టినట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ: మండలంలో పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వి.వి.కిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మక్కువ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వెంకటభైరిపురం, దుగ్గేరు, శంబర, మక్కువ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు.

ఎన్నికల ప్రచారాలపై నిఘా వేయండి



సూచనలు చేస్తున్న ఎన్నికల నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: రాజకీయ పార్టీలు చేపట్టే ఎన్నికల ప్రచారాలపై నిఘా వేయాలని ఎంసీసీ నోడల్ అధికారి ఎంపీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి కచ్చితంగా అమలు జరిగేలా చూడాలన్నారు. ప్రచారాల్లో రాజకీయ నాయకులు ఓటర్లను ప్రలోభ పెట్టినా, మద్యం, డబ్బులు పంపిణీ చేసినా వెంటనే స్పందించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

ఎన్నికల ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్

కురుపాం: ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు చేసేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి వీవీ రమణ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులైనా టోల్‌ఫ్రీ నంబరు 08963 229298 కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

తీరిన ‘చింత’



చింతపండును గ్రేడింగ్ చేస్తున్న గిరిజనులు

సాలూరు రూరల్: మండలంలో పట్టు చెన్నూరు పంచాయతీ శిఖపరువు గిరిశిఖర గ్రామస్తులు చింతపండును మధ్యవర్తులు లేకుండా నేరుగా విక్రయిస్తూ గిట్టుబాటు ధర పొందుతున్నారు. గతంలో ఏజెన్సీ గ్రామాలకు రహదారులు లేకపోవడంతో సేకరించిన చింతపండును మైదాన ప్రాంతాలకు తీసుకొచ్చి విక్రయించేందుకు కష్ట పడాల్సి వచ్చేది. దీంతో కొందరు వ్యాపారులు గిరిశిఖర గ్రామాలకు వెళ్లి తక్కువ ధరకు చింతపండు కొనుగోలు చేసి మైదాన ప్రాంతంలో రెట్టింపు ధరకు విక్రయించి లాభాలు పొందేవారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర ఏజెన్సీ గ్రామాలకు బీటీరోడ్లు నిర్మించడంతో గిరిజనులు నేరుగా సేకరించిన పంటను మైదాన ప్రాంతానికి తీసుకొచ్చి మార్కెట్ ధరకు విక్రయించి లాభాలు పొందుతున్నారు. ఆకోవలోనే శిఖపరువు గ్రామంలో 50 కుటుంబాలు చింతపండును గ్రామంలోనే ఆరబెట్టి గ్రేడింగ్ చేసి నేరుగా పట్టణ ప్రాంతంలో అమ్మకాలు చేస్తున్నారు. గతంలో గ్రామాల్లోని మధ్యవర్తులకు అమ్మకాలు చేసి నష్టపోయేవాళ్లమని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అంటున్నారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడంతో వారి జీవితాల్లో మార్పు వచ్చింది.



రోడ్డుపై ఆరబెట్టిన చింతపండు

పంటలను ధ్వంసం చేసిన గజరాజుల గుంపు



ఏనుగులు ధ్వంసం చేసిన జొన్న పంటను చూపిస్తున్న బాధితురాలు గున్నమ్మ

భామిని: మండలంలోని తాలాడ సమీపంలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు సమీప పొలాల్లో సాగుచేస్తున్న పంటలను ధ్వంసం చేస్తున్నాయి. తాలాడ-బాలేరు గ్రామాల మధ్య ఉన్న పోలాల్లో సాగుచేస్తున్న మొక్కజొన్న, వరి పంటతో పాటు సాగునీటి పైపులను నాలుగు ఏనుగుల గుంపు మంగళవారం రాత్రి ధ్వంసం చేశాయని రైతులు వాపోయారు. తాలాడకు చెందిన రైతులు కొంచాడ శ్రీనివాసరావు, కొంచాడ గున్నమ్మ, కొంచాడ కృష్ణ, అప్పారావులకు చెందిన సుమారు 3 ఎకరాల్లో పంటలను పాడు చేయడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు విలపిస్తున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘా

పాలకొండ: చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ ఎం చంద్రమౌళి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా డివిజన్ కేంద్రానికి వచ్చే అన్ని రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఆయా మార్గాల్లో వచ్చి వెళ్లే వాహనాల వివరాలను నమోదు చేస్తున్నామని తెలిపారు. వాహనదారులు తనిఖీలకు సహకరించాలని కోరారు. వాహనదారులు సంబంధిత పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. కోడ్ అమలు విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్సై ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



గొర్లి రవీంద్రను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: మండలంలోని మార్కొండపుట్టి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లి రవీంద్ర ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బుధవారం ఆయన్ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే పరుశురాంపురం గ్రామానికి చెందిన అధికారి ధనుంజయరావు తల్లి గౌరీశ్వరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలను ధనుంజయరావును అడిగి తెలుసుకుని ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, శివిని పీఏసీఎస్ చైర్మన్ పప్పల గోపాలకృష్ణ, నాయకులు కళింగి మల్లేశ్వరరావు, శెట్టి మధుసూదనరావు, మజ్జి తవిటినాయుడు, చింతాడ అప్పలనాయుడు, పైల వెంకటరమణ ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కార్తీక్

గరుగుబిల్లి: వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించేలా ‘ఫ్యామిలీ డాక్టర్’ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి డా. కె.కార్తీక్ అన్నారు. మండలంలోని సుంకి గ్రామంలో బుధవారం ‘ఫ్యామిలీ డాక్టర్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గ్రామంలో పర్యటించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించారు.

స్ట్రాంగ్‌రూం పరిశీలన

పాలకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి బుధవారం పరిశీలించారు. కిటికీలు, తలుపులకు మరమ్మతులు చేయించాలని సిబ్బందికి సూచించారు. భద్రత పరంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆమె వెంట తహసీల్దార్ వరహాలు, డిప్యూటీ తహసీల్దార్ బుచ్చయ్య ఉన్నారు.

తీరిన మాయ‘దారి’ కష్టాలు

కురుపాం: గ్రామీణ రహదారుల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. రహదారుల నిర్మాణం, మరమ్మతులకు కోట్లాది రూపాయలు ఖర్చుచేసింది. కురుపాం మండలంలో మరిపల్లి పంచాయతీ పరిధి తొస్తంగి గిరిజన గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో ప్రజలు అనేక అవస్థలు పడేవారు. గ్రామానికి రోడ్డు వేయాలని గత టీడీపీ ప్రభుత్వంలో పాలకులను, అధికారులను ఎన్నిసార్లు కోరినా వారి నుంచి స్పందన లేకపోవడంతో విసిగిపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సమస్యను ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె వెంటనే స్పందించి ఉపాధిహామీ పథకం నిధులు రూ.1.05 కోట్లు మంజూరు చేయించారు. దీంతో మొండెంఖల్ గ్రామం నుంచి తొస్తంగి వరకు బీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం గ్రామానికి అత్యవసర సమయంలో ఆటోలు, అంబులెన్స్‌లు వస్తున్నాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా ఉన్న తొస్తంగి గ్రామ రహదారి



మొండెంఖల్ నుంచి తొస్తంగి గ్రామానికి నిర్మించిన రహదారి

జగనన్నతోనే మరింత సంక్షేమం

- మళ్లీ జగనన్నను సీఎంను చేసుకుందాం..
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కళావతి



మహిళా సంఘాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట:

జగనన్నతోనే మరింత సంక్షేమం సాధ్యమని, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి బుధవారం ఆమె శ్రీకారం చుట్టారు. ముందుగా మల్లి సమీపంలో వెలసిన మల్లమ్మ తల్లి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పొంజాడ, బీరపాడు, కుశిమి, శంభాం పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. జై జగన్ నినాదాలతో గ్రామాలు మార్మోగిపోయాయి. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని ఓటర్లను కోరారు. గతంలో ఎన్నికల హామీలను ఇచ్చి మోసగించారని, మళ్లీ అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని దుయ్యబట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల మంజూరు కోసం జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, అయినా పింఛన్ వచ్చేది కాదని గుర్తుచేశారు. జగనన్న పాలనలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా నేరుగా అర్హులు ఎక్కడ ఉంటే అక్కడే పథకాలు అందుతున్నాయని అన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. పేదలకు న్యాయం జరగాలన్నా.. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, పార్టీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు, నాయకులు ఎస్.రాము, ఎస్.సాయికుమార్, ఎన్.అబ్బాస్, రమేష్, బి.వెంకటరావు, జి.కోటేశ్వరరావు, ఎన్.సోమయ్య, ఎన్.కృష్ణ, ఎంపీటీసీ ఎస్.చంద్రశేఖరరావు, సర్పంచ్‌లు తిరుపతిరావు, కూర్మారావు, రాజయ్య, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.